# సిరిసిల్లలో బీఆర్ఎస్, బీజేపీ బాహాబాహీ



- చెప్పులతో పరస్పర దాడులు
- రణరంగంగా మారిన సిరిసిల్ల, పరిస్థితి ఉద్రిక్తం
- పోటాపోటీగా ధర్నాలు, కేటీఆర్, బండి సంజయ్ లపై పరస్పర డౌన్ డౌన్ నినాదాలు
- పోలీసుల లాఠీ చార్జి, ఇరువర్గాలను చదరగొట్టిన పోలీసులు
- బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేసిన పోలీసులు



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీ శ్రేణుల మధ్య బాహా బాహీ ముష్టి యుద్ధం జరిగింది. ఒకే చోట ఇరువర్గాలు ఒకరికి వ్యతిరేకంగా మరొక ధర్నాకు పూనుకోవడంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. మైనర్ బాలిక అంశంలో బండి భగీరథ పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్ ని మంత్రివర్గం నుంచి పరిష్కరించాలని సోమవారం స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలోని నేతన్న చౌక్ వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు ముఖ్య నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. దీనికి పోటీగా 22 మంది ఇంటర్ మైనర్ విద్యార్థుల చావుకు కారణమైన కేటీఆర్ ను శిక్షించాలని, గ్లోబరీనా సంస్థపై సిట్ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కార్యకర్తలు ధర్నాకు దిగారు. కౌంటర్ నిరసనకు బీజేపీ పూనుకొని కేటీఆర్ పై చర్యలు చేపట్టాలని ధర్నాకు ఉపక్రమించారు. అయితే పోలీసులు బీఅర్ఎస్ శ్రేణులను నేతన్న చౌక వద్ద నిరసన తెలుపుకోవాలని, బీజేపీ శ్రేణులను అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన చేపట్టవచ్చని నచ్చ చెప్పారు. దీనితో బీఅర్ఎస్ నాయకులు ప్ల కార్డులతో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి, బండి సంజయ్ బేషరతుగా రాజీనామా చేయాలని, లేనిపక్షంలో వెంటనే భర్తరఫ్ చేయాలని, మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కొనసాగించారు. ఈ నేపథ్యంలో బీజేపీ శ్రేణులు సైతం నేతన్న చౌక్ వద్దకు చేరుకొని నిరసన చేపట్టారు. అయితే ఒకే చోట నిరసనలు కొనసాగడంతో బండి సంజయ్ డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్ శ్రేణులు, కేటీఆర్ డౌన్ డౌన్ అంటూ బీజేపీ శ్రేణులు పరస్పర నినాదాలు చేసుకున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు ఎదురెదురుగా డౌన్ డౌన్ నినాదాలు చేస్తూ ఆందోళనలకు దిగడంతో భారీ ఉద్రిక్తతకు దారితీసింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని పరస్పర దాడులకు పూనుకున్నారు. చెప్పులతో ఒకరిపై ఒకరు విసురుకని కొట్టుకోవడంతో గందరగోళం ఏర్పడింది. పరిస్థితి విషమించడంతో జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి సహా పోలీసు బలగాలు రంగ ప్రవేశం చేశాయి. పోలీసులు ఇరువర్గాలను నియంత్రించే ప్రయత్నం చేసిన పరిస్థితి అదుపుతప్పి విషమించుకోవడంతో లాఠీచార్జ్ చేసి ఇరు వర్గాలను చదరగొట్టారు. ఈ స్థితిలో బీజేపీ శ్రేణులను అదుపులోకి తీసుకొని వ్యాన్లలోకి ఎక్కించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ గలాభాలో పరస్పర చెప్పుల దాడులు విసురుకోవడంలో జిల్లా ఎస్పీ పక్క నుంచే చెప్పు దూసుకు వెళ్ళింది. అయితే త్రుటిలో ఎస్పీకి తాకకుండా తృటిలో తప్పిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ స్థితిలో ఒకవేళ అపశృతి జరిగిన పక్షంలో పరిస్థితి తీవ్రంగా ఉండేదని భావిస్తున్నారు.

## బీఆర్ఎస్ భవన్ వద్ద భారీ నిరసన

నేతన్న చౌక్ వద్ద ఆందోళన ను అదుపుచేసి బీజేపీ, కార్యకర్తలను నాయకులను పోలీసులు అరెస్టు చేసిన అనంతరం అక్కడి నుండి వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు సిరిసిల్ల తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించి బీజేపీ దాడిని ఖండించారు. అనంతరం తెలంగాణ భవన్ ముందు సిరిసిల్ల – కరీంనగర్ రోడ్డుపై బైఠాయించి బండి భగీరథ చిత్రాలతో భారీ ఫ్లెక్సీని రోడ్డులో నేలపై ప్రదర్శించి రాస్తారోకో నిర్వహించారు. దీనితో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి భారీగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను కూడా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల పరస్పర దాడులు నిరసనలతో సిరిసిల్లలో రాజకీయ వేడి అందుకుంది. కాగా ఈ నిరసన కార్యక్రమాలలో నాఫ్స్ క్యాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, బీఅర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనగా, బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డి బోయిన గోపి, పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.









# ప్రతిపక్షం బీఆర్ఎస్ వ్యక్తిగత పోరాటం

### మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్

### గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాతృమూర్తికి నివాళి



**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజా సమస్యలపై పోరాటం చేయకుండా ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ వ్యక్తిగత పోరాటం చేయడం ఏమిటని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు ప్రశ్నించారు. సిరిసిల్లలోని గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాతృమూర్తి నాగుల రామలక్ష్మి ఇటీవల మరణించగా ఆయన కుటుంబాన్ని సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి మంత్రులు పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ మాతృమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అలాగే ఇటీవల హైదరాబాదులోని ఓఆర్ఆర్ రోడ్డు ప్రమాదంలో సిరిసిల్లకు చెందిన ఆరుగురు వ్యక్తులు మరణించగా వారి కుటుంబాన్ని మంత్రులు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రైతులకు కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతుందని, రాష్ట్రంలో ధాన్యం దిగుబడి ఈసారి ఎక్కువగా వచ్చిందని వారు పేర్కొన్నారు. కేంద్రం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తమ బాధ్యతను విస్మరించిందని, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇవ్వాల్సిన కాంట్రిబ్యూషన్ ఏంటో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలపాలని వారు అన్నారు. ఎఫ్‌సిఐ ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రతిపాదించిన కేంద్రం ఎందుకు పట్టించుకోవడంలేదని, దిగుబడి బాగా రావడంతో గోదాంలు నిండిపోగా ఇతర ప్రాంతాల్లో కూడా నిల్వ చేయడానికి చర్యలు తీసుకున్నామని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆన్లైన్ విధానం ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ 15 రోజులు ఆలస్యంగా జరిగిందని కేంద్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా దాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగిస్తుందని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చట్టాలు తీసుకువచ్చిన ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ గతంలో కానీ ప్రస్తుతం కానీ బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడలేదని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడి అంశం కు సంబంధించి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రోడ్లపైకి వచ్చి కొట్టుకోవడం సిగ్గుగా లేదా అని వారు ప్రశ్నించారు. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి బీఆర్ఎస్ హయంలో అనేక కుంభకోణాలు జరిగాయని ప్రస్తుతం హాస్టల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కుంభకోణాలపై కేటీఆర్ చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డైట్ చార్జీలు పెంచడం జరిగిందని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఇక ఏం సమస్య లేనట్టు బీఆర్ఎస్ నాయకులు కేంద్ర మంత్రి కుమారుడి విషయాన్ని ముందుకు వేసుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మంచి పద్ధతి కాదని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ లు పాల్గొన్నారు.



# పదేళ్లు ప్రాజెక్ట్ పూర్తి చేయకుండా ఇప్పుడు పాదయాత్రలా?

### బీఆర్ఎస్ డ్రామాలపై 'టీఆర్ఎస్' మండిపాటు

**ప్రజానావ, హైదరాబాద్:** పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పదేళ్ల అధికారంలో పూర్తి చేయకుండా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఘోర ద్రోహం చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రాజెక్టుల కోసం పాదయాత్ర చేస్తామనడం 'నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు' అన్న చందంగా ఉందని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలమూరు ప్రాంత వలసలకు, వెనుకబాటుతనానికి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీలే పూర్తి బాధ్యత వహించాలని ధ్వజమెత్తారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన టీఆర్ఎస్ ముఖ్య నాయకులు మాట్లాడారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకంతో జిల్లా ప్రజలు బీఆర్ఎస్‌కు 12 ఎమ్మెల్యే స్థానాలను కట్టబెట్టారని టీఆర్ఎస్ నాయకుడు గొంగళ్ల రంజిత్ గుర్తుచేశారు. కానీ పదేళ్లూ అధికారంలో ఉండి ఒక్క ఎకరాకు కూడా నీళ్లివ్వకుండా బీఆర్ఎస్ పాలమూరు వాసుల గొంతు కోసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.35 వేల కోట్ల అంచనా వ్యయం ఉన్న ప్రాజెక్టును రూ.85 వేల కోట్లకు పెంచి, కాంట్రాక్టర్ల కడుపులు నింపి, వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. అప్పటి నీళ్ల మంత్రి హరీష్ రావు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని, బీఆర్ఎస్ నేతలు నిరంజన్ రెడ్డి, జనార్ధన్ రెడ్డిలు ఫైనాన్స్ కంపెనీ పేరుతో భూనిర్వాసితులైన పేద రైతుల పైసలను కూడా దోచుకున్నారని ఆరోపించారు. గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు ఒక్కో రిజర్వాయర్‌ను పంచుకుని తిన్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ నెల 8న లక్ష్మీదేవిపల్లి వద్ద టీఆర్ఎస్ అధినేత్రి కవిత నిర్వహించిన భారీ బహిరంగ సభతో బీఆర్ఎస్ నాయకుల్లో ఉలికిపాటు మొదలైందని రంజిత్ కుమార్ పేర్కొన్నారు. ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను చూసి తట్టుకోలేక, దాని నుంచి తప్పించుకోవడానికే ఇప్పుడు పాదయాత్రల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని ఎద్దేవా చేశారు. చేసిన తప్పులకు పశ్చాత్తాపం లేకుండా ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్తారని, ముందు పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పాలని టీఆర్ఎస్ నేత గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాడు జూరాల నీటి సోర్స్‌ను మార్చేసి కాంట్రాక్టర్లకు వందల కోట్లు కట్టబెట్టిందని వెంకట రమణ మూర్తి విమర్శించారు. బీఆర్ఎస్ తరహాలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మహబూబ్‌నగర్ ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని టీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఉమ్మడి జిల్లా బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఈ ప్రాంతాన్ని విస్మరించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు స్థలంలో తట్టెడు మట్టి కూడా తీయలేదని టీఆర్ఎస్ నేత మెట్రకాడి ప్రభాకర్ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల మధ్య పంచాయితీ పెట్టడమే బీఆర్ఎస్, కాంగ్రెస్ ల సాధన అని దుయ్యబట్టారు. భవిష్యత్తులో తెలంగాణ రక్షణ సేన కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, అప్పుడు కవిత నాయకత్వంలోనే పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని వారు స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో టీఆర్ఎస్ నేతలు కృష్ణా, శ్రావణి, సౌజన్య రెడ్డి, ఎల్లన్, మాలతి, రవి రాథోడ్, శ్యామ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నాలా పనుల వేగవంతానికి చర్యలు

### జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేశ్



**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని బసవతారక నగర్ బస్తీలో కొనసాగుతున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సోమవారం బస్తీలో ఉన్న ప్రధాన నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి, వాటిని వేగవంతం చేయాలని జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్ జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాలా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు ఎండీ గౌస్, భవాని రమేశ్, బోదాస్ నాగార్జున పాల్గొన్నారు.

# భార్య మర్మాంగాలపై యాసిడ్ దాడి

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని పూణే జిల్లా ఉరులి కంచన్ ప్రాంతంలో ఒక హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. ఇక్కడ ఒక భర్త తన 24 ఏళ్ల భార్య పట్ల క్రూరత్వానికి హద్దులు దాటి, ఆమె మర్మాంగాలపై యాసిడ్ పోశాడు. అంతేకాకుండా, ఘటన జరిగిన తర్వాత, గాయపడిన మహిళను చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లకుండా, నిందితుడు ఆమెను దాదాపు 15 రోజుల పాటు తన ఇంట్లో బంధించి ఉంచాడు. ఈ ఘటన ఆ ప్రాంతంలో సంచలనం సృష్టించింది. పోలీసుల ప్రకారం, ఈ సంఘటన ఏప్రిల్ 20న జరిగింది. నిందితుడైన భర్త మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అతను తన భార్య నడవడికపై సందేహాలు వ్యక్తం చేస్తూ ఆమెతో వాదనకు దిగాడు. ఈ వాదన ముదిరి, నిందితుడు ఆమెపై దాడి చేసే స్థాయికి చేరింది. అతను ఆమెకు వివాహేతర సంబంధాలు ఉన్నాయని తరచుగా ఆరోపించేవాడని సమాచారం. కుటుంబ సభ్యుల ప్రకారం, నిందితుడికి కొడుకులు కాకుండా ఇద్దరు కూతుళ్లు ఉన్నారనే అసంతృప్తి కూడా ఉంది. ఈ మనస్తత్వం, అనుమానం అతడిని తన భార్యపై దారుణంగా దాడి చేసేలా పురికొల్పాయి. వాగ్వాదం సమయంలో నిందితుడు యాసిడ్ సీసాను తీసుకువచ్చి తన భార్య మర్మాంగాలపై పోశాడని ఆరోపణలు ఉన్నాయి. దాంతో ఆ మహిళ నొప్పితో కేకలు వేస్తూ బయటకు వెళ్ళడానికి ప్రయత్నించగా, నిందితుడు తలుపు గడియ పెట్టి ఆమెను మళ్లీ కొట్టడం ప్రారంభించాడు. తీవ్రంగా కాలిన గాయాలతో ఆ మహిళ చాలా రోజుల పాటు ఇంట్లోనే తీవ్రమైన నొప్పితో బాధపడింది. బాధితురాలిని కనీసం చికిత్స కోసం కూడా తీసుకెళ్లలేదు. సుమారు 15 రోజుల తర్వాత, ఆమె నిందితుడి చెర నుండి ఎలానో తప్పించుకుని తన బంధువుల వద్దకు చేరుకుంది.

